7

# ప్రభువు సంఘము: డెసిగ్నేషన్

నీవు బాప్తిస్మం పొందినప్పుడు, ప్రభువు నిన్ను తన సంఘానికి చేర్చుతాడు. అప్పుడు నీవు ప్రభువు సంఘం యొక్క సభ్యుడవుగా పని చేయవలసిన అవసరముంటుంది. అనేక రకాలైన సంఘాలు నేడు[1] ఉనికిలో ఉండగా, ప్రభువు యొక్క సంఘాన్ని గుర్తించడం అంత తేలిక కాదు. తరువాత కొన్ని పాఠాలలో, క్రొత్త నిబంధన సంఘము యొక్క గుణగణాలను పరీక్షించుదాం.

మొదటిగా మనం లేఖనానుసారమైన పేర్లను ఆలోచన చేద్దాం. సంఘమంతటిని ఏకంగా బైబిలు ఎలా చూస్తుందో, అటుపిమ్మట సంఘం యొక్క వ్యక్తిగతమైన సభ్యులు ఎలా పిలువబడ్డారో చూద్దాం.

## డెసిగ్నేషన్: పూర్వగాధ

ప్రత్యేకమైన పేర్లను మనం ఆలోచింపకముందు, పూర్వగాధను గూర్చి కొన్ని మాటలు నేను చెప్పవలసియుంటుంది. "నామములు" అనకుండ డెసిగ్నేషన్‌ను "పేరు" అని నేను ఉపయోగిస్తున్నా, ఎందుకంటే క్రొత్త నిబంధనలో సంఘానికి సొంత పేరు ఏదీ యివ్వబడలేదు.

"పేర్లకును" "నామాలకును" గల వ్యత్యాసమేమి? నీవు దీనిని చదువుచుండగా ఏదో ఒకదానిమీద కూర్చుండియుండవచ్చు. నా ఉదాహరణ కొరకు, నీవు కుర్చీమీద కూర్చున్నావని ఊహించుతున్నా. నీవు దానిని "కుర్చీ" అని పిలిచినట్లయితే, కేవలం అదేమైయుందో దాన్ని గూర్చి మాట్లాడుతున్నావు. అది వర్ణించే పదం; అది దాని పేరు. దానికి నీవు ఒక ప్రత్యేకమైన నామకరణం చేయవచ్చు. ఉదాహరణకు, దానికి "జార్జి" అని నామకరణం చేశావనుకుందాం. అది దాని అసలైన నామము.

నా ఉదాహరణ మూర్ఖంగా ఉన్నమాట వాస్తవమే, కాని క్రొత్త నిబంధన సంఘానికి సొంతమైన ఏ నామము యివ్వలేదని కేవలం ఏదో ఒక పేరుతో (డెసిగ్నేషన్‌తో) పిలుస్తుందని నీ మనస్సున నాటించడానికే నేను ప్రయత్నం చేస్తున్నా. సంఘాన్ని గూర్చి ఉపయోగింపబడిన పదాలన్నీ, అదేమైయుందో తెలియజేస్తాయి.

ఇది సత్యమైనందున, ప్రభువు సంఘం కొరకైన డెసిగ్నేషన్ (పేరు) నేను ఎక్కడ ఉపయోగించినా, "సంఘమని" సూచిస్తాను. సంఘానికి సొంతమైన నామము ఏదీ లేదనీ, దానికి కేవలం డెసిగ్నేషన్ను మాత్రమే నేను ఉపయోగిస్తాను.

రెండవది, రూలు ప్రకారం, సంఘానికి ఉన్న డెసిగ్నేషన్లు క్రీస్తును ఆయన తండ్రిని ఘనపరుస్తాయి. ప్రభువైన యేసుకు "అన్ని నామములకంటె పై నామము" యివ్వబడింది (ఫిలిప్పీ. 2:9). మత శాఖలకు సంబంధించిన నామకరణాలు, తరచుగా ఆ మత శాఖ యొక్కయు, స్థాపకుని యొక్కయు లేదా సిద్ధాంతము యొక్కయు పేర్లను ప్రసిద్ధి చేస్తాయి.

నిజానికి ప్రభువు మాత్రమే ఘనపరచబడాలి. “మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము” అని పేతురు ప్రకటించాడు (అపొ. 4:12).

## డెసిగ్నేషన్: సంపూర్తిగా

ఇదంతా మనస్సుల్లో ఉంచుకొని, సంఘమంతటి డెసిగ్నేషన్స్‌ను (పేరును) మొదటిగా తిలకించుదాం. క్రొత్త నిబంధనలో ఎక్కువ కాలం సంఘము కేవలం “సంఘమనే” పిలువబడింది (అపొ. 5:11; 8:1, 3; 9:31; 11:22, 26). గనుక, నా రచనలోను, ఉపదేశంలోను నేను సాధారణంగా దానిని “సంఘమని” తప్ప మరేమని సూచించను.

అప్పుడప్పుడు, సంఘాన్ని వర్ణించే పద ప్రయోగాలను లేఖనాలు ఉపయోగిస్తూ ఉంటాయి. ఉదాహరణకు, సంఘాన్ని పౌలు “ప్రభువు యొక్క సంఘమని” సూచించాడు (అపొ. 20:28; ASV).[2] హెబ్రీ. 12:23 సంఘాన్ని “జ్యేష్ఠుల సంఘము” అని పిలిచింది.[3] పలుమార్లు “దేవుని సంఘము” అని ప్రయోగింపబడింది (1 కొరింథీ. 1:2; 15:9; 2 కొరింథీ. 1:1; గలతీ. 1:13; 1 తిమోతి 3:15 చూడు).

తన ప్రాంతంలో ఉన్న అనేక స్థానిక సంఘాలను ఉద్దేశించి రోమా 16:16లో పౌలు యిలా అంటున్నాడు, “క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి.”[4] “క్రీస్తు సంఘములన్నియు” అనేది మత శాఖల పేరు గాక, వర్ణనతో కూడిన ప్రయోగమైయుంది. క్రీస్తు యొక్క అంటే “క్రీస్తుకు చెందిన” అనే భావంతో, అవి “క్రీస్తుకు చెందిన స్థానిక సంఘాలు”[5] అని దాని అర్థం. “క్రీస్తు సంఘము” లేక “క్రీస్తు సంఘాలు” అని నేను ఉపయోగించినప్పుడు, ఆ “సంఘము” లేక ఆ “స్థానిక సంఘాలు” క్రీస్తుకు చెందినవనే భావంతోనే మాట్లాడుతున్నాను.

## డెసిగ్నేషన్: వ్యక్తులుగా

సంఘంలోని వ్యక్తిగతమైన సభ్యులు ఎలా పిలువబడ్డారు? వ్యక్తిగతమైన సభ్యులను సూచించడానికి క్రొత్త నిబంధనలో పలువిధములైన పదాలు ఉపయోగింపబడ్డాయి. వాటిలో కొన్ని యిక్కడ యివ్వబడ్డాయి:

- “సహోదరులు”[6] మరియు “సహోదరీలు” (అపొ. 6:3; 9:30; రోమా 16:1; యాకోబు 2:15). ఉపయోగించబడినవాటిలో యిది బహు సాధారణమైన పదం. ఇది (ఆత్మసంబంధమైన) కుటుంబ బాంధవ్యాన్ని సూచిస్తుంది.
- “పరిశుద్ధులు” (రోమా 1:7; 8:27; 12:13; 15:25). “పరిశుద్ధుడు” అంటే “పాప రహితుడు” అని కాదు, “ప్రత్యేకింపబడిన వాడు” అని అర్థం.[7] బాప్తిస్మం పొందే సమయంలో, తన యొక్క ప్రత్యేకమైన ప్రజగా దేవుడు క్రైస్తవుని వేరు చేసికొంటాడు (తీతు 2:14).
- “శిష్యులు” (అపొ. 6:1, 2, 7; 9:1). అపొస్తలుల కార్య గ్రంథంలో

క్రీస్తును వెంబడించేవారు తరచుగా ఈ పద ప్రయోగంతో సూచింపబడ్డారు. "వెంబడించువాడు," "నేర్చుకొనువాడు"[8] అని ఈ పదం సూచిస్తుంది.

సంఘము యొక్క సభ్యులకు ప్రత్యేకించి యివ్వబడినది "క్రైస్తవుడు" అనే పేరు. మనం ముందుగా చూచిన డెసిగ్నేషన్స్‌కు భిన్నంగా యిది సొంత పేరని చెప్పవచ్చు. క్రొత్త నిబంధనలో యిది తరచుగా కన్పించకపోయినా, అది మాత్రం విశేషమైన విధానంగా ఉపయోగింపబడింది. "మొట్టమొదట అంతియొకయలోని శిష్యులు క్రైస్తవులనబడిరి" అని లూకా తెలిపాడు (అపొ. 11:26). రాజైన అగ్రిప్ప ఎదుట పౌలు ప్రసంగించిన తరువాత, "ఇంత సులభముగా నన్ను క్రైస్తవుని చేయ జూచుచున్నావే" అని అతడు పౌలుతో అంటాడు (అపొ. 26:28). "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమపరచవలెను" అని పేతురు వ్రాశాడు (1 పేతురు 4:16).

నేను ముందుగా చెప్పినట్టే, రూలు ప్రకారం, క్రొత్త నిబంధన పేర్లు ప్రభువైన యేసును మరియు దేవుని ఘనపరుస్తాయి. "క్రైస్తవుడు" అనే పదంలో సగం భాగం "క్రీస్తు" ఉన్నాడు.

"క్రిస్టియన్" అనేది గ్రీకు పదంయొక్క ఆంగ్ల రూపం.[9] "క్రీస్తు" అనే గ్రీకు పదంతో ఆయనకు సొంతగాడు లేక చెందినవాడు అనే పదం తగిలింపబడి "క్రైస్తవుడు" అని రూపించబడింది. క్రైస్తవుడంటే, "క్రీస్తుకు చెందినవాడు" అనేది అక్షరార్థం.

## క్రైస్తవుడు = క్రీస్తుకు చెందినవాడు

"క్రీస్తు సంఘం" సామూహికంగా ఎలాగో అలాగే వ్యక్తిగతంగా ఆ మాటకు అర్థం అదే: "క్రైస్తవుడంటే" క్రీస్తుకు చెందిన వ్యక్తి అనేది ఎలాగో అలాగే "క్రీస్తు సంఘం" అంటే సంఘం క్రీస్తుకు చెందింది అనే భావంతో పిలువబడింది.

మత సంబంధంగా నేనేమైయున్నాను అని ఎవరైనా నన్ను అడిగితే, "నేను క్రైస్తవుడను" అనేది నా జవాబై ఉంటుంది. కొన్ని సార్లు నేను ఒత్తిడి చేయబడతాను: "నీవు ఏ మత సంస్థకు చెందినవాడవు?" అని నన్నడిగినప్పుడు, "క్రీస్తుకు చెందిన సంఘ సభ్యుడను," లేదా "క్రీస్తు సంఘము" అని బదులిస్తాను. అన్ని వేళ్లల నేను నా ప్రభువును ఘనపరచగోరతాను.

## ముగింపు

మానవ పేర్లు తగిలించుకొనడం విభజనను ప్రోత్సహించడం ఔతుంది. ఇది నేడు నిజం, క్రొత్త నిబంధన రచనలో ఉన్న కాలంలో కూడా యిది నిజమే. కొరింథీ సంఘానికి పౌలు వ్రాసినప్పుడు వివిధ భాగాలుగా అది విచ్ఛిన్నమయ్యే పరిస్థితిలో ఉంది:

> సహోదరులారా, మీరందరు ఏకభావముతో మాటలాడవలెననియు, మీలో కక్షలు లేక, యేక మనస్సుతోను ఏక తాత్పర్యముతోను, మీరు సన్నద్ధులై యుండవలెననియు, మన ప్రభువైన యేసు క్రీస్తు పేరట మిమ్మును వేడుకొనుచున్నాను. నా సహోదరులారా, మీలో కలహములు కలవని ... నాకు తెలియవచ్చెను. మీలో ఒకడు – "నేను పౌలువాడను,

ఒకడు – "నేను అపొల్లోవాడను,"[10] మరియొకడు – "నేను కేఫావాడను,"[11] ఇంకొకడు – "నేను క్రీస్తు వాడనని చెప్పుకొనుచున్నారని నా తాత్పర్యము" (1 కొరింథీ. 1:10-12).

"పౌలువాడను," "అపొల్లోవాడను" అనేలాంటి మాటలు – రోమా 16:16ను గూర్చి ముందుగానే ప్రస్తావించినట్టు, వ్యక్తుల సొంతాన్ని సూచిస్తున్నాయి. "నేను పౌలుకు చెందినవాడను," "నేను అపొల్లోకు చెందినవాడను" అని అట్టివాటి అక్షరార్థం. అలా తమను తాము గుర్తింపజేసికొన జూచినవారిని పౌలు యిలా సిగ్గుపరచాడు, "క్రీస్తు విభజింపబడి యున్నాడా? పౌలు మీ కొరకు సిలువ వేయబడెనా? పౌలు నామమున మీరు బాప్తిస్మము పొందితిరా?" (1 కొరింథీ. 1:13). మానవ పాపంకొరకు క్రీస్తు మాత్రమే సిలువవేయబడ్డాడు (1 కొరింథీ. 1:23). విశ్వాసులు క్రీస్తు నామములో బాప్తిస్మం పొందారు (అపొ. 2:38); గనుక, వారు ఆయన పేరు మాత్రమే ధరించాలి.

నన్ను అపార్థం చేసికోవద్దు: సరియైన డెసిగ్నేషన్ (పేరు) ఉంటేనే సరిపోతుందని నా అర్థం కాదు సుమీ. "Mercedes Benz" అని నా కారుమీద పెయింట్ చేసినంత మాత్రనా అది Mercedes Benz గా మారిపోదు.[12] అయినా, లేఖనానుసారమైన పేరు ప్రాముఖ్యమైనదే. క్రీస్తు నామాన్ని గూర్చి పేతురు ఏమి తెలిపాడో గుర్తుంచుకో, "మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము అనెను" (అపొ. 4:12). "ఆ పేరును బట్టియే దేవుని మహిమపరచవలెను" (1 పేతురు 4:16).

సూచనలు

[1]నేను జనులతో చదివేటప్పుడు, "క్రొత్త నిబంధన రచనా కాలంలో కేవలం ఒకే ఒక సంఘం ఉండియున్నట్టయితే, ఈ సంఘాలన్నీ ఎక్కడనుండి వచ్చాయి?" అని అడుగుతాను. లేక "ఈ మత శాఖలు ఎందుకు ఉన్నాయి?" అని అడుగుతాను. దానికి చిన్న జవాబు–ప్రవచింపబడినట్టే జనులు సత్యమునుండి తొలిగిపోయారు (అపొ. 20:29, 30; 1 తిమోతి 4:1-3; 2 తిమోతి 4:1-4). [2]NASBవలె తెలుగులో కూడ "దేవుని సంఘం" అనే తర్జుమాయే ఉంది; అయితే ఆ సందర్భంలో కుమారుడైన దేవుడు అయ్యున్నట్టు తెలుస్తుంది. [3]ఆదిమ భాషలో "జ్యేష్ఠుల" అనేది బహువచనం అనగా "సంఘం జ్యేష్ఠులతో కూడినదని" అంటే, క్రైస్తవులతో. [4]"పవిత్రమైన ముద్దు పెట్టుకొని ఒకనికొకడు వందనములు చేయుడి" అంటూ రోమా 16:16 ఆరంభమౌతుంది. ఆ దినాల్లో, పురుషులు పురుషులు; స్త్రీలతో స్త్రీలు ముద్దుతో వందనాలు చెప్పుకునేవారు (లోకంలో పలు భాగాల్లో యింకా యిలాటి పద్ధతి ఉంది). ప్రతి ఒక్కరు ముద్దుతోనే వందనాలు చెప్పుకోమని ఆజ్ఞాపించబడలేదు. నొక్కి పలికింది "పరిశుద్ధమైన" అనే దానిమీద "నిష్కపటమైన కరచాలనంతో ఒకనినొకడు వందనములు చేయుడి" అని మన దేశపు వాడుకలో చెప్పవచ్చు. [5]గ్రీకువలెనే తెలుగులో కూడ సొంతదనాన్ని సూచిస్తుంది. [6]క్రొత్త నిబంధన సహోదరులు అని. [7]"పరిశుద్ధుడు" అనే మాట పరిశుద్ధపరచబడిన అనే గ్రీకు పదంనుండి వచ్చింది. [8]ఏ నాయకుని అనుసరించేవాడైనా శిష్యుడనబడవచ్చు. క్రీస్తు శిష్యుడా కాదా అనేది సందర్భం తెలియజేస్తుంది. [9]గ్రీకు పదమునుండి ఆంగ్ల పదము సృష్టించుకొన్నారు. [10](అకయలోని) కొరింథీ ప్రాంతంలో, అపొల్లో సువార్తికుడుగా పని చేసినట్టున్నాడు (అపొ. 18:27, 28).

[11]కేఫా అనేది అపొస్తలుడైన పేతురుకు మరో పేరు (యోహాను 1:42). [12]Mercedes Benz అనేది బహు ఖరీదైన కారు.